సాక్షి
నారాయణపేట
ఆదివారం । 14 । సెప్టెంబర్ । 2025



పట్టుకోండి.. చూద్దాం

మక్తల్‌లో రోజురోజుకు దొంగల బెడద అధికం కావడంతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోయింది.

-8లో ▸



జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శనివారం ఎగువ నుంచి 1.57 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినట్లు అధికారులు వివరించారు.

-8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2/22.1

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై అవుతుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లోక్‌అదాలత్‌లో 5,581 కేసుల పరిష్కారం

నారాయణపేట: జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 4 బెంచులు ఏర్పాటు చేయగా.. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ న్యాయమూర్తి, చైర్మన్ బోయ శ్రీనివాసులు, లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి వింధ్యానాయక్, జూనియర్ సివిల్ న్యాయమూర్తి సాయి మనోజ్, అడిషనల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి అవినాష్ హాజరయ్యారు. లోక్ అదాలత్‌లో మొత్తం 5,581 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు. జిల్లాలోని 14 పోలీస్‌స్టేషన్లతో పాటు రెండు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న కేసులను న్యాయవాదులు సహకరించి పరిష్కారానికి కృషి చేశారు. రూ.22,17,956 ఆదాయం ప్రభుత్వానికి సమకూరిందని జిల్లా న్యాయమూర్తి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కురుమన్నగౌడ్, సత్యనారాయణగౌడ్, వినోద్ కుమార్, సురేంద్రాచారి పాల్గొన్నారు.

'ఓపెన్' ప్రవేశాల గడువు పొడిగింపు

కోస్గి రూరల్: 2025–2026 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాల గడువును ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 18 వరకు పొడిగించినట్లు గుండుమాల్ వికాస్‌సూర్కిల్ టాస్ కో–ఆర్డినేటర్ సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు నేరుగా మీ–సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని.. పూర్తి వివరాలకు సెల్‌నంబర్ 96183 17850 సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన అవసరం

నారాయణపేట టౌన్: సామాజిక న్యాయం అంటే సమాజంలోని ప్రతి వ్యక్తికి సమాన అవకాశాలు, గౌరవం, హక్కులు అందించడమేనని సోషల్ జస్టిస్ ఫోరం బోర్డు రాష్ట్ర చైర్మన్ దోర్నాల సత్య అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలో బోర్డు జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు యశ్వంత్, వెంకటేష్ యాదవ్, సుదర్శన్, హన్మంతు, కవిత, సునీత, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం



జిల్లాలో ఇలా..

ప్రాథమికోన్నత పాఠశాలలు	ఉన్నత పాఠశాలలు	8వ తరగతి విద్యార్థులు
86	75	5,153

ఏడాది వారీగా ఎంపికైన విద్యార్థులు

2022-23	2023-24	2024-25
47	46	46

నవంబర్ 23న ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

- ఎంపికైతే ఏటా రూ.12 వేల ఉపకార వేతనం
- ప్రతిభ చాటితే నాలుగేళ్ల పాటు అందజేత
- దరఖాస్తునకు అక్టోబర్ 6 వరకు అవకాశం

నారాయణపేట రూరల్: పేద విద్యార్థులు ఆర్థిక సమస్యలతో విద్యాభ్యాసాన్ని మధ్యలోనే నిలిపివేయకుండా వారిని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రతిభ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) అందిస్తోంది. 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి అర్హత పరీక్ష ప్రకటనను ఇటీవల విడుదల చేసింది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభంకాగా.. అక్టోబర్ 6 వరకు అవకాశం కల్పించింది. నవంబర్ 23న జిల్లాకేంద్రంలో పరీక్ష నిర్వహించేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. ఇందులో ఎంపికైతే తొమ్మిదో తరగతి నుంచి 12వ తరగతి వరకు నాలుగేళ్ల పాటు ఏటా రూ.12 వేల చొప్పున మొత్తం రూ.48 వేలు విద్యార్థుల బ్యాంకు ఖాతాలో జమవుతాయి.

పరీక్ష విధానం..

మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ప్రశ్నలుంటాయి. మెంటలెబిలిటీ (ఎంఏటీ), లాస్టిక్ ఎబిలిటీ (ఎస్ఏటీ), ఏడు, ఎనిమిదో తరగతికి సంబంధించిన గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. పూర్తి వివరాలకు బీఎస్ఈ తెలంగాణ వెబ్‌సైట్‌ను పరిశీలించాలి.

ప్రణాళికతో చదివితే..

మొత్తం 180 మార్కులకు పరీక్ష నిర్వహించగా.. ప్రశ్నాపత్రం రెండు విభాగాలుగా ఉంటుంది. పార్ట్–ఏలో మానసిక సామర్థ్య పరీక్ష 90 మార్కులకు 90 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో రీజనింగ్ ఎబిలిటీ, సంఖ్యాశాస్త్రం, పదాల భిన్న పరీక్ష, నంబర్ అనాలజీ, ఆల్ఫాబెట్ అనాలజీ, కోడింగ్, డీకోడింగ్, లాజికల్ ప్రశ్నలు, వెన్ చిత్రాలు, మిర్రర్ ఇమేజెస్, వాటర్ ఇమేజెస్‌కు సంబంధించిన అంశాలు ఉంటాయి. పార్ట్–బిలో ఏడు, 8వ తరగతికి సంబంధించి 90 ప్రశ్నలకు 90 మార్కులు కేటాయించారు. వాటిలో గణితం 20, సామాన్య శాస్త్రం 35, సాంఘిక శాస్త్రం 35 మార్కులు కేటాయిస్తారు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ప్రణాళికతో చదివి పరీక్షకు హాజరవుతే తప్పక విజయం సాధించేందుకు అవకాశం ఉంటుంది.

ఆర్థిక తోడ్పాటు..



మాది పేద కుటుంబం. మొదటి నుంచి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నా. గతేడాది ఉపాధ్యాయుల సహకారంతో ఎన్ఎంఎంఎస్ శిక్షణ తీసుకొని ఉత్తీర్ణత సాధించా. ఏటా ప్రభుత్వం ఇచ్చే పారితోషికం నా చదువుకు ఎంతో ఉపయోగపడుతుంది. మా నాన్నకు భారం తగ్గింది.

– చైతన్య, విద్యార్థి, షేర్నపల్లి

పిల్లలకు తర్ఫీదునిస్తున్నాం..



పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉపకార వేతనం ఎంతో ప్రయోజనం. ప్రణాళికతో చదివితే విజయం సాధించవచ్చు. అన్ని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులకు సంబంధిత ఉపాధ్యాయులు ఆయా సబ్జెక్టుల్లో మెళకువలు నేర్పిస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– గోవిందరాజు, జిల్లా విద్యాధికారి

అర్హత..

8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు. ఏడోతరగతి పరీక్షలో 55 శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీలైతే 50 శాతం మార్కులుంటే సరిపోతుంది. ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలు, హాస్టల్ సౌకర్యం లేని ఆదర్శ పాఠశాల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.50 ఫీజు చెల్లించాలి. ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను ధ్రువీకరిస్తూ బోనఫైడ్ ఇవ్వాలి. అదేవిధంగా విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షల్లోపు ఉండాలి.



దామరగిద్దలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు విద్యార్థులను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయుడు

పరిహారం పెంపు చారిత్రాత్మక నిర్ణయం

- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి, ఎమ్మెల్యే

నారాయణపేట: నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఎకరాకు రూ.20 లక్షల పరిహారం చెల్లింపునకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దీంతో శనివా రం మంత్రి వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మె ల్యే డా. చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల ఆవేదనను అర్థం చేసుకొని వారికి న్యాయం జరిగేలా పరిహారం పెంచుతూ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంతో నారాయణపేట, కొడంగల్, మక్తల్ ప్రాంత రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. భూ సేకరణ ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని ప్రథమ ప్రాధాన్యంగా తీసుకుంటుందన్నారు. నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతలతో సస్యశ్యామలంగా మారబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి.. చిత్రంలో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి

జాతి పునర్నిర్మాణంలో విద్యార్థులే కీలకం

నారాయణపేట రూరల్: జాతి పునర్నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని బిజ్వార్ పీఠం స్వామీజీ ఆదిత్య పరాశ్రీ అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏబీవీపీ పాలమూరు విభాగ్ నిర్వహించిన అభ్యాసవర్గకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల్లో జాతీయ భావాలను పెంపొందించేందుకు విద్యాసంస్థలతో పాటు ఏబీవీపీ కృషి చేస్తోందన్నారు. విద్యా విధానంలో సంస్కృతాన్ని ఒక పాఠ్యాంశంగా చేర్చాలని సూచించారు. విదేశీయుల దండయాత్రతో దేశ సంస్కృతి ధ్వంసమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంగ్ల భాషను నేర్చుకోవడంతో పాటు మాతృభాషను విస్మరించరాదని.. కంప్యూటర్, ఖగోళశాస్త్రంపై దృష్టి సారించాలని సూచించారు. ఉన్నత చదువుల తర్వాత ఇతర దేశాలకు వెళ్లకుండా సొంత ప్రాంతానికి సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం తెలంగాణ ప్రాంత సహ సంఘటన మంత్రి విష్ణువర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరుణాకర్, సంయుక్త కార్యదర్శి నరేష్తేజ్, నరేంద్ర, పృథ్వి, జిల్లా కన్వీనర్ నరేష్, మహిళా ఇన్‌చార్జ్ రేణుక, సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదిత్య పరాశ్రీ స్వామీజీ

పంటల దిగుబడికి శాస్త్రీయ సర్వే

జిల్లాలోని 13 మండలాల్లో 51 గ్రామాలు ఎంపిక



నర్వ మండలం జంగంరెడ్డిపల్లిలో పంట సర్వే చేపడుతున్న అధికారులు (ఫైల్)

- వ్యవసాయ, ప్రణాళిక శాఖ సంయుక్తంగా..
- కొత్తగా రూపొందించిన యాప్‌లో వివరాల నమోదు
- శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులు

నర్వ: జిల్లాలో వానాకాలం సాగు.. పంట దిగుబడి అంచనాలను పక్కాగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు మండలాల వారీగా ఎంపిక చేసిన గ్రామాలు, సర్వేనంబర్ల వివరాలను జిల్లా అధికారులకు పంపించారు. పంట కోత ప్రయోగాలు పకడ్బందీగా చేపట్టేందుకు సిబ్బందికి శిక్షణనిచ్చారు. కొత్తగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉండగా వ్యవసాయ, ప్రణాళికాశాఖ సిబ్బంది సంయుక్తంగా ప్రయోగాలు నిర్వహిస్తారు. ఈ వానాకాలంలో జిల్లావ్యాప్తంగా 76 క్లస్టర్లలో 51 గ్రామాల్లో పంట కోత ప్రయోగాలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎంపిక చేసిన గ్రామాల్లో పంటల వారీగా శాస్త్రీయంగా దిగుబడులను అంచనా వేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది వానాకాలంలో సాధారణ సాగు 4.20 లక్షల ఎకరాలు ఉండగా.. ఇప్పటికే 4 లక్షలు సాగు చేశారు.

వివరాల నమోదు ఇలా..

గ్రామాల వారీగా కేటాయించిన పంట పొలానికి అధికారులు వెళ్లాలి. పంటకోత ప్రయోగాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కొత్తగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేయాలి. నిర్దేశించిన పంటతో పాటు దిగుబడులను ఫొటోతో అప్‌లోడ్ చేయాలి. మండల సాగు విస్తీర్ణం మేరకు 3 నుంచి 5 గ్రామాలను పంట కోత ప్రయోగాలకు ఎంపిక చేశారు. రైతు పొలంలో నైరుతి భాగాన్ని ఎంపిక చేసి అక్కడి పంటను విడిగా కోసి తూకం వేస్తారు. పంట కోత ఫొటోతో పాటు తూకం ఫొటోను అప్‌లోడ్ చేయాలి. సాగుకయ్యే పెట్టుబడి, వినియోగించిన ఎరువులు, పురుగు మందులు, ఆశించిన తెగులు తదితర వివరాలు నమోదు చేయాలి.

పకడ్బందీగా సర్వే..



జిల్లాలో వానాకాలం పంటల దిగుబడి అంచనా వేసేందుకు పంటకోత ప్రయోగ సర్వేను పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన డిజిటల్ జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సర్వే ఎలా నిర్వహించాలనే అంశాలపై సిబ్బందికి శిక్షణనిచ్చాం. సర్వేలో సేకరించిన వివరాలను యాప్‌లో ఎలా నమోదు చేయాలో వివరించాం. సర్వే ఆధారంగా ధరల నియంత్రణపై ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకునేందుకు దోహదపడనుంది.

– సింగ్ యోగానంద్, చీఫ్ ప్లానింగ్ అధికారి, నారాయణపేట

నమోదు తప్పనిసరి..

డిజిటల్ క్రాప్ సర్వేకు వచ్చే ఏఈఓలు, మండల ప్రణాళిక అధికారులకు రైతులు సహకరించాలి. ఎంపిక చేసిన గ్రామాల్లో పంటల దిగుబడిని అంచనా వేసేందుకు పంటకోత సమయంలో ప్రయోగాలు చేపట్టి వివరాలను యాప్‌లో నమోదు చేయాలి.

– నగేష్‌కుమార్, ఏడీఏ

మండలాల వారీగా ఎంపికైన గ్రామాలు..

మండలం	గ్రామాలు
దామరగిద్ద	మొగుల్‌మడ్క, ఉల్లిగండం, అయ్యవారిపల్లి, పిడెంపల్లి
నారాయణపేట	ఎక్లాస్‌పూర్, కవరంపల్లి, అప్పక్‌పల్లి, కోటకొండ
ఊట్కూర్	పెద్దజట్రం, ఊట్కూర్, సమస్తాపూర్, పగిడిమర్రి
మాగనూర్	నేరెడుగాం, పెగడబండ, పుంజనూర్, మందిపల్లి
కృష్ణా	కున్సి, కృష్ణా, హిందూపూర్, ఐనాపూర్
మక్తల్	పస్పుల, చిన్నగోప్లాపూర్, సోమేశ్వరబండ, జక్లేర్
నర్వ	రాజుపల్లి, యాంకి, కల్వాల్, ఎల్లంపల్లి
మరికల్	రాకొండ, మరికల్, పూసల్‌పహాడ్, మాద్వార్
ధన్వాడ	గోటూర్, ధన్వాడ, పాతపల్లి, కిష్టాపూర్
మద్దూర్	పల్లెర్ల, చింతలదిన్నె, మోమిన్‌పూర్, లక్కపల్లి
గుండుమాల్	సారంగరావుపల్లి, గుండుమాల్, బోగారం, బలభద్రాయపల్లి
కోస్గి	లోదీపల్లి, సర్జఖాన్‌పేట, మీర్జాపూర్
కొత్తపల్లి	నందిగాం, కొత్తపల్లి, మన్నాపూర్

సర్వే చేపట్టనున్న పంటలు..
వరి, జొన్న, మొక్కజొన్న, కంది, మిరప, పత్తి

పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం

బీఆర్ఎస్ హయాంలోనే 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాం

" ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి 18 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించాం. వలసల జిల్లాగా పేరుగాంచిన పాలమూరుకే వలస వచ్చేలా కృషి చేశాం. గతంలో గద్వాల ప్రాంతానికి వచ్చిన క్రమంలో రోడ్డు పక్కనున్న పొలంలో పనులు చేస్తున్న కూలీలను పలుకరించి మీరు ఎక్కడి నుంచి వచ్చారని అడిగితే కర్ణాటకలోని రాయచూరు, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నుంచి వచ్చినట్లు చెప్పారు." అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' దినపత్రికలో 'నాడు జీళ్లు.. నేడు సిరులు' శీర్షికన ప్రచురితమైన కథనాన్ని బహిరంగ సభలో ప్రదర్శించారు. అలాగే సీడ్ పత్తి రైతులకు అండగా ఉంటామని సీడ్ కంపెనీలు పెట్టే ఇబ్బందులు తొలగిపోయేలా బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని కేటీఆర్ చెప్పారు.

- సొంత అభివృద్ధి కోసమే 'బండ్ల' పార్టీ మారాడు
- ఉప ఎన్నికల్లో ఆయన్ను చిత్తుచిత్తుగా ఓడించండి
- గట్టు ఎత్తిపోతలను పండబెట్టారని మండిపాటు
- గద్వాల జిల్లాతో సహా మెడికల్, నర్సింగ్ కళాశాలలు, గురుకులాలు, ఆస్పత్రుల ఏర్పాటు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

గద్వాల: 'తన తలను రైలు కింద పెట్టినా చనిపోతా కానీ, కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లనని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వైఎస్సార్ చౌరస్తాలో ఎంపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా చెప్పారు.. మరి ఇప్పుడు ఎక్కడ ఉన్నాడు.. సొంత అభివృద్ధి కోసం పార్టీ మారిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని రాబోయే ఉప ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించాలని' బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం కేటీఆర్ గద్వాల పర్యటన సందర్భంగా ముందుగా జిల్లాకేంద్రంలోని ప్రధాన మార్గంలో ర్యాలీ తీసి.. తేరు మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి కోసం పార్టీ మారానని చెబుతున్న ఎమ్మెల్యే బండ్ల ఈ రెండేళ్ల కాంగ్రెస్ పార్టీ హయాంలో ఏమి అభివృద్ధి జరిగిందో.. నియోజకవర్గానికి ఒక్క రూపాయి వచ్చిందో చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. ఆరు గ్యారంటీ పథకాలు ఎగ్గొట్టినందుకు పార్టీ మారాడా? రైతుబంధు రూ.15 వేలు ఇవ్వనందుకు పార్టీ మారాడా? ఆసరా పింఛన్ ఇవ్వనందుకు పార్టీ మారాడా? షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకం కింద ఆడపడుచులకు తులం బంగారం ఇవ్వనందుకు పార్టీ మారాడా? ఎందుకు పార్టీ మారాడో ఎమ్మెల్యే బండ్ల ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఇంకా సిగ్గులేని విషయం ఏమంటే తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానంటూ చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి సంకలో కూర్చుని సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని మండిపడ్డారు. 2014లో గద్వాలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఓడినప్పటికీ మెడికల్, నర్సింగ్ కళాశాలలు, గురుకులాలు, గట్టు, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాలు, 1,275 డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ప్రభుత్వ ఆస్పత్రి ఇలా అన్ని రకాల సంక్షేమాభివృద్ధి పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పంటలు సాగు చేసుకునేందుకు ఏ ఒక్క రైతు కూడా ఇబ్బందులు పడొద్దని ఎకరాకు రూ.10వేల చొప్పున రైతుబంధు వారి ఖాతాలో జమచేశామని, పేదింటి ఆడబిడ్డలు ఇబ్బందులు పడొద్దని షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు, దళితబంధు వంటి పథకాలు అమలు చేశామని గుర్తుచేశారు.



'సాక్షి'లో వచ్చిన కథనాన్ని చూపిస్తూ మాట్లాడుతున్న కేటీఆర్

కష్టకాలంలో పార్టీకి అండగా..

గద్వాలలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు బాసు హనుమంతు అండగా నిలబడి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పార్టీలో చురుకుగా ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్నారన్నారు. అలంపూర్ నియోజకవర్గం రాజోళిలో ఇథనాల్ ఫ్యాక్టరీని వ్యతిరేకించినందుకు 15 మంది రైతులను జైలుకు పంపారని ఆరోపించారు. నిర్మల్‌లో రద్దు చేసిన విధంగా ఇక్కడ కూడా ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని, ఆ ఫ్యాక్టరీ లైసెన్సు రద్దు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం చేస్తూ రెతులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విజయుడు, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు జైపాల్‌యాదవ్, అంజయ్య, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్, బాసు హనుమంతు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు పాల్గొన్నారు.



జైతెలంగాణ నినాదాలు చేస్తున్న కేటీఆర్, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు.. చిత్రంలో మాజీ మంత్రులు లక్ష్మారెడ్డి, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

➪ గట్టు మండలంలో 35 వేల ఎకరాలకు సాగునీటిని అందించాలని గట్టు ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేసి 40 శాతం పనులు పూర్తిచేశామని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఎత్తిపోతలను పండబెట్టిందని దుయ్యబట్టారు. మళ్లీ కేసీఆర్ సీఎం కావాలంటే రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలు, ఉప ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగురవేయాలని ప్రజలను కోరారు. ఉప ఎన్నికల కంటే ముందుగా స్థానిక సంస్థ ఎన్నికలు వస్తాయని గద్వాల మున్సిపాలిటీలో మొత్తం 37 వార్డులు ఉన్నాయని ఇందులో కనీసం 30 వార్డులు గెలిపించాలని విన్నవించారు.

రామన్‌పాడులో నిలకడగా నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో శనివారం సముద్ర మట్టానికి పైన 1,020 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 550 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతుండగా..సమాంతర కాల్వలో సరఫరా లేదన్నారు. ఇదిలా ఉండగా జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 875 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 55 క్యూసెక్కులు, తాగు నీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు వివరించారు.

24న బ్రహ్మోత్సవాల పనులకు టెండర్లు

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయం వద్ద వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను ఈ నెల 24న సీల్డ్ కవరు టెండర్లు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మధనేశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఫ్లవర్ డెకరేషన్, లైటింగ్, కలర్స్ వేయడం, చలువ పందిళ్లు, ప్రింటింగ్ మెటీరియల్, టెంటు, పూజా సామగ్రి, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ఆసక్తి గలవారు టెండర్లు వేయాలని కోరారు.

క్లుప్తంగా

సరస్వతీదేవి ఆలయంలో హుండీ చోరీ



మరికల్: మండల కేంద్రంలోని సరస్వతీ దేవి ఆలయంలో గుర్తు తెలియని దుండగులు హుండీ చోరీ చేసిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయిచూర్ రోడ్డు పక్కన ఉన్న సరస్వతీదేవి ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి సమయంలో ఆలయంలోకి చొరబడి హుండీ తాళం పగలగొట్టి అందుల్లో ఉన్న డబ్బులను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం పూజ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా గమనించిన భక్తులు ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు హుండీని పరిశీలించారు. సీసీ కెమెరాలను పరిశీలించినా దొంగల ఆచూకీ లభించలేదు. దొంగలను పట్టుకుంటామని ఏఎస్ఐ ఎల్లయ్య తెలిపారు. ఇదే ఆలయంలో హుండీ చోరీకి గురికావడం రెండోసారి కావడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం లారీ పట్టివేత

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలం వై శాఖాపూర్ నుంచి వరిధాన్యం తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ యుగేందర్‌రెడ్డి వివరాల మేరకు.. వై శాఖాపూర్‌లోని అమల ట్రేడింగ్ ఇండస్ట్రీస్ నుంచి శుక్రవారం అర్ధరాత్రి లారీలో 385 బ్యాగుల సన్నరకం వడ్లను కర్ణాటకు తరలిస్తున్నారని పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. తోమాలపల్లి వద్ద లారీని పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. శనివారం డీఎస్‌ఓ కాశీవిశ్వనాథానికి సమాచారం అందించగా.. పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ పరమేశ్ లారీలోని వడ్లను తనిఖీ చేశారు. వడ్ల శాంపిల్ సేకరించినట్లు డీటీ తెలిపారు.

ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు

లింగాల: దాడికి పాల్పడిన తోకల రవి, బునాద్రి సాయి, గుత్తి శ్రీనులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడు శనివారం తెలిపారు. మండలంలోని అప్పాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లాయపల్లి పెంటకు చెందిన తోకల లింగయ్యపై, తోకల నడిపి బాలమ్మపై అదే పెంటకు చెందిన తోకల రవి ఈ నెల 8వ తేదీన అకారణంగా దాడి చేసి గాయపర్చాడు. మండల కేంద్రంలోని ఓ చికెన్ సెంటర్ వద్ద ఈ నెల 11న రాత్రి బునాద్రి సాయి, గుత్తి శ్రీనులు ఇరుకు సుధాకర్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆయా ఘటనలకు బాధ్యులైన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కీచక ఉపాధ్యాయుడు

- పాలమూరులోని ఓ పాఠశాల విద్యార్థినితో అసభ్యకర ప్రవర్తన
- పోక్సో కేసు నమోదు.. రిమాండ్

మహబూబ్‌నగర్ క్రైం: మహబూబ్‌నగర్ మండలం ధర్మాపూర్ పాఠశాలలో ఇటీవల జరిగిన ఘటనను మర్చిపోకముందే మరో ప్రభుత్వ పాఠశాలలో దారుణం చోటుచేసుకుంది. బాలబాలికలకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుడు కీచకుడిగా మారాడు. గత రెండేళ్లుగా ఓ విద్యార్థినిని మానసికంగా, ఇతర రూపాల్లో వేధింపులకు గురిచేస్తూ వచ్చాడు. కీచక ఉపాధ్యాయుడి వేధింపులు భరించలేక బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ సీఐ అప్పయ్య వివరాల మేరకు.. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రమేశ్ రెండేళ్ల నుంచి అదే పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థినిని వేధింపులకు గురిచేస్తున్నాడు. ఇటీవల భద్రాచలం టూర్ వెళ్లిన నాటి నుంచి సదరు విద్యార్థినిపై ఉపాధ్యాయుడి వేధింపులు మరింత పెరిగాయి. డబ్బులు ఆశ చూపడంతో పాటు ఇతర మార్గాల్లో ఆ విద్యార్థినిని లోబర్చుకోవాలని ప్రయత్నాలు చేశాడు. దీంతో పాటు అసభ్య పదజాలం ఉపయోగిస్తూ నిత్యం ఇబ్బందులకు గురిచేశాడు. ఉపాధ్యాయుడి వేధింపులు భరించలేక విద్యార్థిని తన తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. శనివారం అతడిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గోపాల్‌పేట: పురుగుల మందుతాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. రేవల్లి హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. రేవల్లి మండలంలోని తల్పునూరు గ్రామానికి చెందిన మద్దిలేటి సురేష్ (35) ఆగస్టు 27న అప్పులబాధ ఎక్కువైందని, ఆవేదన కు గురై పురుగుల మందు తాగగా స్థానికులు గుర్తించి నాగర్‌కర్నూల్ ఆస్పత్రిలో చేర్పించారు. శనివారం చికిత్స పొందుతూ సురేష్ మృతి చెందాడు. మృతుడి అన్న శేఖర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన ట్లు వివరించారు. సురేష్ భార్య మూడేళ్ల క్రితం మరణించింది. తన ఇద్దరు కూతుర్లను పెంచలేక, అప్పుల బాధ భరించలేక మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు.

4 దశాబ్దాలుగా ఉద్యమంలోనే..

- మోస్ట్ వాంటెడ్ మావో అగ్ర నాయకురాలు సుజాతక్క లొంగుబాటు
- కేంద్ర కమిటీ సభ్యురాలిగా, మావో అగ్రనేత కిషన్‌జీ భార్యగా గుర్తింపు
- ఆమెపై మొత్తం 106 కేసులు, రూ.కోటి రివార్డు
- బాల్యమంతా స్వగ్రామం పెంచికలపాడు, అయిజలోనే గడిపిన వైనం



పెంచికలపాడులోని సుజాతక్క తల్లి వెంకమ్మ, సోదరుడు ప్రభాకర్‌రెడ్డి

గట్టు: మావోయిస్టు పార్టీ అగ్ర నాయకురాలు పోతుల పద్మావతి.. 19 ఏళ్ల వయసులో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న క్రమంలో రాడికల్స్ విద్యార్థి సంఘం వైపు ఆకర్షితురాలై అడవి బాట పట్టారు. 43 ఏళ్ల పాటు అజ్ఞాతంలోనే గడిపారు. ఉద్యమంలో చురుగ్గా పాల్గొంటూ.. ఛత్తీస్‌గఢ్ సౌత్‌సభ జోనల్ బ్యూరో ఇన్‌చార్జిగా, పార్టీ కేంద్ర కమిటీలో ఏకైక మహిళా సభ్యురాలి స్థాయికి ఎదిగారు. ఎన్నో ఎన్‌కౌంటర్లలో త్రుటిలో తప్పించుకున్నారు. ఈమెపై 106 కేసులు, రూ.కోటి రివార్డు ఉంది. నక్సల్ ఉద్యమంలో చేరిన నాటి నుంచి ఏనాడు స్వగ్రామం పెంచికలపాడు, విద్యనభ్యసించిన అయిజ వైపు తిరిగి చూడలేదు. అల్లారుముద్దుగా చూసుకున్న తండ్రి ఆమెపై బెంగతో మృతిచెందగా.. ఒకే ఒక్కసారి స్వగ్రామానికి రహస్యంగా వచ్చి వెళ్లారు. 'ఏదో ఒకరోజు ఎన్‌కౌంటర్‌కు గురవుతుంది అన్న వార్త వింటామేమో' అని ఆశలు వదులుకున్న తల్లి, అన్నదమ్ముల్లో.. లొంగిపోయింది అన్న విషయం తెలియడంతో ఆనందం వెల్లివిరిసింది. ఆమె రాకకోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

❖ పోతుల పద్మావతి అలియాస్ కల్పన అలియాస్ సుజాతక్క శనివారం ప్రభుత్వం ఎదుట లొంగిపోయిందన్న వార్త జోగుళాంబ గద్వాల జిల్లాలో చర్చాంశనీయాంశమైంది. గట్టు మండలం పెంచికలపాడుకి చెందిన తిమ్మారెడ్డి, వెంకమ్మ దంపతుల రెండో సంతానం పోతుల పద్మావతి. అయితే రవాణా సౌకర్యాలు ఏమాత్రం లేని పెంచికలపాడు నుంచి అయిజలో ఉంటున్న స్వాతంత్ర్య సమరయోధుడు, తాతయ్య అయిన రామిరెడ్డి ఇంటికి అప్పట్లో మకాం మారారు. పద్మావతి అక్కడే ఉంటూ 10వ తరగతి, గద్వాలలోని మహారాణి ఆది లక్ష్మీదేవమ్మ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసింది. డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న క్రమంలోనే రాడికల్స్ విద్యార్థి సంఘం వైపు ఆకర్షితురాలయ్యారు. చివరికి 1983లో నక్సల్ ఉద్యమంలో చేరి అటు నుంచే అటే అడవి బాట పట్టారు. ఏనాడు ఇటు వైపు తిరిగి చూడలేదు. అయితే కూతురిపై ఎక్కువ ప్రేమను పెంచుకున్న కన్నతండ్రి తిమ్మారెడ్డి పద్మావతి నక్సల్స్ వైపు వెళ్లిపోవడంతో ఏడాది మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తండ్రి మృతి చెందిన ఏడాది తర్వాత ఒక రోజు రహస్యంగా స్వగ్రామానికి వచ్చి వెళ్లిన ఆమె మళ్లీ ఇటువైపు కన్నెత్తి చూడలేదు.

కిషన్ జీ భార్యగా..

పద్మావతి మావోయిస్టు ఉద్యమంలో చురుగ్గా ఉంటూ అంచెలంచెలుగా ఎదిగారు. మావో అగ్రనేత కిషన్‌జీని వివాహం చేసుకున్నారు. వీరికి కూతురు ఉన్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వివరాలు మాత్రం తెలియడం లేదు. అనేక పర్యాయాలు ఎన్‌కౌంటర్లు జరిగినప్పటికీ పద్మావతి చాకచక్యంగా తప్పించుకున్నారు. 2011లో కిషన్‌జీ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన తరుణంలో పోతుల పద్మావతి గురించి తెరపైకి చర్చ వచ్చింది.

పాత తరం వారికే గుర్తు..

పెంచికలపాడుకి చెందిన పద్మావతి గురించి కేవలం అప్పటి పాత తరం వారికి మాత్రమే తెలుసు. ప్రస్తుతం 60 ఏళ్లు పైబడిన వారు మాత్రమే పద్మావ తి గురించి తెలుసని చెబుతున్నారు. 1983లో నక్సల్స్ ఉద్యమంలోకి వెళ్లిన పోతుల పద్మావతి మళ్లీ ఇటు వైపు కన్నెత్తి చూడలేదు. కేవలం ఒకే ఒక్క సారి తండ్రి చనిపోయిన ఏడాది తర్వాత రహస్యంగా ఇక్కడి వచ్చి వెళ్లింది. అయితే పద్మావతి బాల్యం మొత్తం అయిజలోనే గడిపిందని, సెలవులు ప్రకటించిన సందర్భంలో పెంచికలపాడుకి వచ్చేదని గ్రామ పెద్దలు తెలిపారు.

కుటుంబసభ్యుల్లో ఆనందం

మావోయిస్టు పద్మావతి హైదరాబాద్‌లో డీజీపీ ఎదుట లొంగిపోయిందన్న వార్త టీవీల్లో చూసి ఆమె కుటుంబసభ్యులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. 84 ఏళ్ల పద్మావతి తల్లి వెంకమ్మకు మాత్రం తన కూతురు పోలీసుల ఎదుట లొంగిపోయిన విషయం సాయంత్రం దాకా తెలియదని కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే కూతురి కోసం ఎదురుచూస్తూనే ఉందని వారు తెలిపారు. సోదరులు శ్రీనివాసరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, సోదరి హేమలత పద్మావతి రాక కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఒకానొక సందర్భంలో నక్సల్స్ ఉద్యమంలోకి వెళ్లిన పోతుల పద్మావతి ఏదో ఒక రోజున ఎన్‌కౌంటర్‌కు గురవుతుందని భావిస్తున్న తరుణంలో.. పోలీసుల ఎదుట లొంగిపోవడంపై ఇటు కుటుంబ సభ్యులు, అటు పెంచికలపాడు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పట్టుకోండి.. చూద్దాం



శాంతమ్మ వైన్స్‌లో వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

- మక్తల్‌లో వరుస చోరీలు
- తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్
- మూడురోజుల క్రితం ఆరు బైకులు చోరీ
- తాజాగా రెండు మద్యం దుకాణాల్లో లూటీ
- రూ.4లక్ష వరకు నగదు, సీసీ హార్డ్‌డిస్క్ అపహరణ
- పోలీసులకు సవాల్‌గా మారిన వరుస దొంగతనాలు



మక్తల్: పట్టణంలో రోజురోజుకు దొంగల బెడద అధికం కావడంతో ప్రజలకు కునుకు పట్టడం లేదు. రాత్రయ్యిందంటే చాలు ఎవరూ బయటకు వెళ్లకుండా ఇంటి వద్దే కాపలా కాస్తున్నారు. తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకొని వరుస చోరీలకు పాల్పడుతున్నారు. మూడు రోజుల క్రితం ఆరు బైకులను చోరీ చేశారు. తాజాగా రెండు వైన్స్ షాపులను లూటీ చేశారు. పట్టణంలోని 167వ అంతర్రాష్ట్ర రహదారి పక్కనున్న శాంతమ్మ వైన్స్ షట్టర్స్ ధ్వంసం చేసి క్యాష్ కౌంటర్‌లో ఉన్న రూ. 3లక్షల నగదు, శేష వైన్స్‌లో రూ. 40వేలు నగదు చోరీకి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు శనివారం క్లూ టీంతో వివరాలు సేకరించారు. యజమానుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, గత జూలై 11న పట్టణంలోని టీచర్స్ కాలనీలో చంద్రశేఖర్‌రెడ్డి ఇంటి తాళం పగులగొట్టి 12 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు దొంగలను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. ఎల్లమ్మ కుంటలో తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. మూడు రోజుల క్రితం సంగంబండ రోడ్డులో ఇళ్ల ఆవరణలో నిలిపిన 6 బైకులను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై మక్తల్ పోలీసులకు యాజమానులు ఫిర్యాదు చేశారు. మక్తల్‌లో దొంగతనాలు అధికం కావడంతో కొందరు అద్దె ఇళ్లను ఖాళీ చేసి ఎక్కువమంది ఉన్న వద్దకు అద్దెకు తీసుకుంటున్నారు.

చోరీల నియంత్రణకు చర్యలు



మక్తల్ సర్కిల్ పరిధిలో చోరీల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. ప్రత్యేకంగా రెండు టీంలను ఏర్పాటు చేశాం. దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేశాం. వరుస చోరీలతో కొందరిని పట్టుకొని రిమాండ్‌కు తరలించాం. ఎవరైనా కొత్త వారు వస్తే అనుమానం వచ్చిన వారు ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. రాత్రిళ్లు అనుమానం వచ్చిన ప్రదేశాల్లో పెట్రోలింగ్ చేస్తున్నాం.

– రామ్‌లాల్, సీఐ, మక్తల్

ట్రస్మా వెల్ఫేర్ ఫండ్‌కు రూ.10లక్షలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ట్రస్మా ఆధ్వర్యంలో ప్రైవేట్ ఉపాధ్యాయులకు సన్మానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ట్రస్మా వెల్ఫేర్ ఫండ్‌కు తన తరఫున రూ.10లక్షలు ఇస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులకు తెలంగాణ ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని ఏఎస్ఎన్ గార్డెన్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే యెన్నం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వెనుకబడిన జిల్లాగా ఉన్న పాలమూరుకు ఇంజినీరింగ్, లా, ఐఐఐటీ కళాశాలల ను తీసుకొచ్చామని, వాటిద్వారా ఇక్కడి విద్యార్థులకు విద్య, ఉపాధి అవకాశాలు మెరుగుపడతా యని తెలిపారు. అంతేకాకుండా ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆరోగ్య బీమా కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రతి ఉద్యోగి రూ.250, యాజమాన్యం రూ.250 చెల్లిస్తే నిధి తయారవుతుందన్నారు. రెండురోజులపాటు విద్య మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ట్రస్మా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ఆనంద్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, క్రాంతికుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వంశీమోహన్, కిరణ్మయి, రిషి కళాశాలల చైర్మన్ చంద్రకళావెంకటయ్య, లక్ష్మణ్‌గౌడ్, విజేత వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

న్యాయం చేయండి మహాప్రభో..



తమ గోడును ఎస్ఐకి వెలిబుచ్చుతున్న బాధితుడు

- తమ ప్లాట్లను ఆక్రమించుకునే వారిపై చర్యలు తీసుకోవాలి
- వెంచర్ వద్ద బాధితుల ఆందోళన

అచ్చంపేట రూరల్: పట్టణంలోని రియల్ వ్యాపారులు అమాయక ప్రజలను మోసం చేస్తూనే ఉన్నారు. అధికార పార్టీకి అనుబంధంగా ఉన్న రియల్ వ్యాపారుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. బాధితులు కథనం ప్రకారం.. పట్టణంలోని సర్వే నెంబరు 26లో 2009 ఏడాదిలో భూ యజమాని 49 మందికి పట్టాల రూపంలో ప్లాట్లను విక్రయించాడు. ఐదేళ్ల క్రితం ప్లాట్ల యజమానులకు తెలియకుండా భూ యజమాని అప్పట్లో ఉన్న రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై వేరేవారికి రిజిస్ట్రేషన్ చేశాడు. 2009లో లేని భూమిని 2019లో ఎలా సృష్టించారని బాధితులు ఆరోపించారు. పాత పాస్ బుక్‌లో లేని వివరాలను కొత్తగా సృష్టించారన్నారు. ధరణి సాఫ్ట్‌వేర్‌లో రెవెన్యూ అధికారుల అండదండలతో తప్పుడు రికార్డులు సృష్టించి సర్వే నెంబర్ 27/1 అని కొత్తగా సృష్టించారన్నారు. భూ యజమానిపై మళ్లీ రికార్డులు సృష్టించినట్లు బాధితులు వాపోయారు. అంతేకాకుండా మరికొంత మంది పేరుమీద మారడం.. అది తప్పుగా ఉన్నట్లు జిల్లా స్థాయి అధికారులు నివేదికలు అందించారన్నారు.

వెంచర్ వద్ద బాధితుల ఆందోళన

తమకు ఎలాంటి సమాచారం లేకుండా అక్రమంగా వెంచర్‌ను సృష్టించి పనులు చేస్తున్నారని శనివారం బాధితులు వెంచర్ వద్ద ఆందోళన చేశారు. 2009 సంవత్సరంలో కష్టపడి ప్లాట్లను కొనుగోలు చేశామని, చాలారోజులుగా తమను వేధిస్తున్నారని బాధితులు ఆరోపించారు. ప్లాట్లను కొనుగోలు చేసిన వారిలో గిరిజనులు, బుడగజంగాలు, పేదలే ఉన్నారని, గతంలో ఉన్న ప్రజాప్రతినిధులు, ప్రస్తుత ప్రజాప్రతినిధుల వద్దకు తమ సమస్యను తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తేల్చాల్సి ఉండగా.. కొందరు తమను మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. బాధితులకు అండగా ఉండాల్సిన కొన్నిశాఖల అధికారులు తమపైనే తప్పుడు కేసులు బనాయిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని, స్థానిక పోలీసులు కూడా కుమ్మక్కయ్యారని వాపోయారు. ఎస్ఐ విజయభాస్కర్ తమ సిబ్బందితో వెంచర్ వద్దకు వచ్చి బాధితులతో మాట్లాడారు. రెండురోజుల్లో ఇరువర్గాలను పిలిపించి సమస్య పరిష్కారమయ్యే విధంగా చూస్తామన్నారు.

మద్దెలబండలో చిరుత సంచారం



మద్దెలబండ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఫారెస్టు అధికారులు

మల్దకల్: మండలంలోని మద్దెలబండ గ్రామ సమీపంలోని ఊరగట్టు నర్సింహులు వ్యవసాయ పొలం వద్ద శనివారం తెల్లవారుజామున చిరుతపులి సంచరించినట్లు గ్రామస్తులు తెలిపారు. వ్యవసాయ పొలం వద్ద పశువుల కొట్టం వద్ద కాపలాగా ఉన్న నర్సింహులు కుక్కలపై దాడి చంపినట్లు బాధితుడు తెలిపారు. పొలం పరిసరాల్లో ఉన్న గుట్టల్లో చిరుత సంచరిస్తున్నట్లు రైతులు ఫారెస్టు అధికారులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ ఫర్వేజ్ అహ్మద్, ఎఫ్ఎస్ఓ ప్రసూన, ఎఫ్‌డీఓ కీర్తి చిరుత జాడలను గుర్తించారు. కుక్కలపై దాడి చేసి చంపింది చిరుతేనని వారు నిర్ధారించారు. ధరూరు మండలం కొత్తపాలెంలో ఇటీవలే వ్యవసాయ పొలంలోని పశువులపై దాడి చేసిన చిరుతే ఇక్కడ సంచరిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రైతులు ఎవరూ ఒంటరిగా వ్యవసాయ పొలాలకు వెళ్లొద్దని, ముఖ్యంగా రాత్రి వేళల్లో వ్యవసాయ పొలాల వద్ద పశువులను ఉంచొద్దని సూచించారు. అదే విధంగా మద్దెలబండ గ్రామంలో దండోరా వేయించాలని అధికారులకు సూచించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఉండవెల్లి: మండలంలోని జోగుళాంబ రైల్వే హాల్ట్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (38) ఔరంగాబాద్–గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ అశోక్ శనివారం తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడు వనపర్తి జిల్లా బుద్ధారం గ్రామానికి చెందిన వ్యక్తిగా సమాచారం అందినట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

రైలు కిందపడి మహిళ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి గుర్తు తెలియని మహిళ మృతిచెందింది. రైల్వే ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని బోయపల్లి గేట్ సమీపంలో శనివారం గుర్తుతెలియని మహిళ(50) ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందింది. మృతురాలి దగ్గర ఎలాంటి ఆధారాలు లేవని, మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు సెల్ నం.87126 58597 కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువతి అదృశ్యమైన ఘటనలో శనివారం కేసు నమోదైనట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం బిజినేపల్లి మండలం పాలెం గ్రామానికి చెందిన శివ వైష్ణవి బుక్ సెంటర్ దుకాణం నడుపుతోంది. ఉదయం దుకాణం తెరిచి కొంచెం సమయం తర్వాత తాళం వేసి ఎక్కడికో వెళ్లింది. మధ్యాహ్నం తర్వాత బుక్‌సెంటర్‌కు తాళం వేయడంతో కూతురు కన్పించలేదు. దీంతో బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: నల్లగొండ జిల్లాలో ఈనెల 14న ప్రారంభమయ్యే 12వ రాష్ట్రస్థాయి సీనియర్స్ యోగాసన పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా క్రీడాకారులను శనివారం సాయంత్రం జిల్లా ప్రధాన స్టేడియంలో అభినందించారు. 18–21 ఏళ్లలోపు విభాగంలో నందిని, కావేరి, అంకిత, పూజ, శైలజ, 21–25 ఏళ్లలోపు విభాగంలో స్వప్న, శ్వేత, సాగర్, మధు, ఆకాష్, 25–30 ఏళ్లలోపు విభాగంలో బాలమణి, 35–40 ఏళ్లలోపు విభాగంలో వెంకటేష్ ఉన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు కె.రాములు, కార్యదర్శి ఆర్.బాలరాజు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి కురుమూర్తి గౌడ్, యోగా సంఘం ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, కిషన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

- నాలుగు రోజుల తర్వాత వెలుగులోకి..

గండీడ్: ఓ వ్యక్తి నాలుగు రోజుల క్రితం కనిపించకుండా పోయి చివరకు శనివారం చెట్టుకు శవమై కనిపించాడు. మృతదేహం పూర్తిగా కుళ్లిన దశలో ఉంది. వివరాల్లోకి వెళితే గండీడ్ మండలంలోని వెన్నాచేడ్ గ్రామానికి చెందిన నీరటి రామయ్య (58) నాలుగు రోజుల క్రితం కనిపించకుండా పోయాడు. భార్య చెన్నమ్మ పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోయింది. శనివారం వెన్నాచేడ్ దోశోని కాల్వ సమీపంలో ఓ మృతదేహం కనిపించింది. కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం ఎవరిదని గుర్తించడానికి కష్టంగా మారింది. భరించరాని దుర్వాసన వెదజల్లు తుండడంతో దాని దగ్గరకు వెళ్లడానికి ఎవరూ సాహసించలేదు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే కనిపించకుండా పోయిన రామయ్య భార్య చెన్నమ్మకు ఓ మృతదేహం గ్రామ సమీపంలో ఉన్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో ఆమె వచ్చి బట్టలు, ఇతర ఆనవాళ్లు గుర్తించి మృతుడు తన భర్త రామయ్యగా గుర్తించింది. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

జూరాలకు పెరిగిన ఇన్‌ఫ్లో



జూరాల ప్రాజెక్టు 18 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

- 1.57లక్షల క్యూసెక్కుల వరద
- 18 క్రస్టు గేట్ల ఎత్తివేత

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు శనివారం రాత్రి 9 గంటల వరకు 1.57 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 18 క్రస్టు గేట్లను ఎత్తి 1.27 లక్షల క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి నిమిత్తం 35,259 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 47 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 550 క్యూసెక్కులు, కుడి కాల్వకు 260 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 1.63 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.909 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ సందర్భంగా 12 యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు.

సంగంబండ రిజర్వాయర్ గేట్ ఎత్తివేత

మక్తల్: కర్ణాటక సమీపంలోని ఇడ్లూర్ పెద్దవాగు నుంచి నీటి ప్రవాహం అధికం కావడంతో చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ సంగంబండ రిజర్వాయర్ ఒక గేట్ ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసినట్లు ఇరిగేషన్ డీఈ సురేష్ తెలపారు.